www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 డిసెంబర్ 2024
5
తిరుపతి



స్థానికులకు దర్శన టోకెన్లు జారీ



ప్రజాశక్తి- తిరుమల
గత నెలలో జరిగిన తొలి టీటీడీ బోర్డు సమావేశంలో స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని తీర్మానం చేసిన మేరకు సోమవారం తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి తిరుమల స్థానికులకు దర్శన టోకెన్ల జారీని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ స్థానికులకు శ్రీవారి దర్శనం పునరుద్ధరించేందుకు తొలిబోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. శ్రీవేంకటేశ్వరుని దర్శనం చేసుకునే అవకాశం కల్పించడం పట్ల స్థానికులు ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. అనంతరం అడిషనల్ ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ తిరుమల, తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, చంద్రగిరి స్థానికులకు దర్శన కోటా ఖరారు చేసేందుకు టీటీడీ అధికారులు తీవ్ర కసరత్తు చేశారన్నారు. సామాన్య భక్తులు, ప్రత్యేక ప్రవేశ దర్శన కోటాకు ఎలాంటి అంతరాయం కలగకుండా స్థానికుల దర్శన కోటా పునరుద్ధరించామని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టు మెట్లెక్కిన ఉచిత సేవకులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తమను ఆలయ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలంటూ శ్రీకాళహస్తీశ్వరాలయ ఉచిత సేవకులు హై కోర్టు మెట్లెక్కారు. వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పదేళ్లగా ఉచిత సేవ చేస్తున్న 18 మందిని ఆలయ ఉద్యోగులుగా గుర్తించి జీతభత్యాలు చెల్లించాలని గత పాలకమండలి 2022లో రాష్ట్ర దేవాదాయశాఖకు విన్నవించింది. పాలకమండలి అభ్యర్థనను మన్నించిన దేవాదాయశాఖ కమిషనర్ 18 మంది ఉచిత సేవకులను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తూ వేతనాలు చెల్లించాలంటూ 2023లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారిని గురుదక్షిణామూర్తి వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కింద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకుంటూ టెండర్ దాఖలు చేశారు. వీరు ఎన్నికల ముందు మూడు నెలలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేశారు. అయితే ప్రభుత్వం మారగానే విధులకు రాకుండా అడ్డుకున్నారు. జీతభత్యాల సంగతిని పక్కన పెట్టేశారు. ఈ విషయంపై పలుమార్లు ఈవోల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉచిత సేవకులపై వైసీపీ ముద్ర పడటంతో స్థానిక ఎమ్మెల్యే నుంచి కూడా సహకారం అందని పరిస్థితి. దీంతో చేసేది లేక ఉచిత సేవకులు హైకోర్టును ఆశ్రయించారు. తమను తొలగించి కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారిని నియమించుకోవాలన్న కుట్రతో ఇదంతా చేస్తున్నారని ఉచిత సేవకులు వాపోతున్నారు. పొట్ట కూటి కోసం కొలువులు వెతుక్కుంటున్న తమను రాజకీయ ముద్ర వేసి బతుకులు కొట్టద్దని వాపోతున్నారు.

రంగినేనిని వరించునున్న ముక్కంటి పీఠం

రేపో మాపో ఉత్తర్వులు



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: టీడీపీ సీనియర్ నేత, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడికి ముక్కంటి పీఠం దక్కే అవకాశాలు దాదాపు ఖరారయ్యాయి. ఆ మేరకు రేపో మాపో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విలువడనున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కార్యాలయం నుంచి అధిష్టానం పరిశీలనలో చెంచయ్య ఉన్నట్లుగా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రెండుసార్లు సీఎం చంద్రబాబును, నారా లోకేష్‌ను చెంచయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిసిన విషయం తెలిసిందే. 30 ఏళ్ల నుంచి చెంచయ్య నాయుడు బొజ్జల కుటుంబంతో కలిసి నడుస్తున్నారు. 2014-19 మధ్య రెండుసార్లు శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వ్యవహరించి అక్కడ అభివృద్ధిలో తన ముద్ర వేశారు. అడవిని తలపించే మార్కెట్ రోడ్డును సిమెంటు రోడ్లు, సుందరీకరణతో తీర్చిదిద్దారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో కొత్త గోదాములు, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించారు. ఆయన హయాంలోనే శ్రీకాళహస్తి పట్టణంలో తొలిసారిగా వారపు సంతను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టినా ధైర్యంగా పార్టీ గెలుపుకు పోరాడారు.

మద్యం వద్దు.. నాణ్యమైన విద్య ముద్దు..

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి
- ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు
- జిల్లా కన్వీనర్‌గా వందవాసి నాగరాజు



ఎన్నికైన నూతన జిల్లా కార్యవర్గం, నూతన కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి/సత్యవేడు:
రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యం అవసరం లేదు.. నాణ్యమైన విద్య కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి సూచించారు. వెనుకబడ్డ రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సత్యవేడులో జరుగుతున్న 14వ సీపీఎం జిల్లా మహాసభలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభలకు ముఖ్యఅతిథిగా డి.రమాదేవి హాజరయ్యారు. అదాని సోలార్ విద్యుత్ కుంభకోణంపై దేశ వ్యాప్తచర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఈ భారం అందరిపైనా పడుతుందని తెలిపారు. విద్య ప్రయివేటీకరణలో భాగంగా జగన్ బ్రిటన్‌తో జగన్ చేసుకున్న 'సాల్ట్' ఒప్పందాన్ని కొనసాగించకుండా చంద్రబాబు రద్దు చేయాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూళ్లు చేసి అదానీ, అంబానీకి ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పనితీరు ఉందని మండిపడ్డారు. ఇప్పటికే జాతీయ రహదారుల్లో టోల్ ఫీజుల ద్వారా రూ.22వేలు కోట్లు దోచిపెట్టిన బాబు ప్రభుత్వం జిల్లా రహదారుల ద్వారా కూడా ప్రజల టోల్ తీసేందుకు సన్నాహాలు చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన మద్యం ఇస్తామంటున్న చంద్రబాబు నాణ్యమైన విద్యనెందుకు ఇవ్వలేకున్నారని ప్రశ్నించారు. ఆధ్యాత్మిక నగరి తిరుపతిని వాటికన్ సిటీగా తీర్చిదిద్దుతామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. గుడులు, బడుల వద్ద మద్యం దుకాణాలు వద్దంటూ స్థానిక ప్రజానీకం తిరగబడుతోందని గుర్తు చేశారు. అనంతరం తిరుపతి జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన 28 అంశాలతో కూడిన తీర్మాణాలను మహాసభల ద్వారా ఆమోదించారు. తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంతో ప్రారంభించిన సోమశిల- స్వర్ణముఖి ప్రాజెక్టు పనులు అటవీ అనుమతులు, నిధుల లేమి, పరిహార వివాదాల కారణంగా గత పదేళ్లగా నత్తను తలపిస్తున్నాయి. కాలువ పనులు పూర్తయితే వెంకటగిరి, రాపూరు, ఢక్కిలి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు, 150 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. పాలక ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు మోపుకోవడం తప్పా సాధించిందేమీ లేదనీ, వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి లక్ష్యం నీరుగారకుండా చూడాలన్నారు.

మన్నవరం బెల్ పరిశ్రమను పునరుద్దరించాలని కోరారు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి పన్ను పెంపును రద్దుచేయాలన్నారు. దశలవారీ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను నిలువరించాలని డిమాండ్ చేశారు. అధిక ధరలతో నియంత్రణతోపాటు, కార్మికుల వేతనాలను రూ.26వేలకు పెంచాలని కోరారు. పులికాట్ సరస్సును అభివృద్ధి పరచి, మత్స్యకారులకు బాసటగా నిలవాలని చెప్పారు. చేనేత, పవర్ ల్యూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 15 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రమేష్, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

జిల్లా కార్యదర్శిగా 'వందవాసి నాగరాజు'

తిరుపతి జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. సత్యవేడులో సోమవారం జరిగిన సీపీఎం 14వ మహాసభల సందర్భంగా ఆయన్ను రెండో పర్యాయం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం గమనార్హం. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కందారపు మురళీ, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, దాసరి జనార్ధన్, కమిటీ సభ్యులుగా సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమార్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్యలు వ్యవహరించారు. నూతన కమిటీ నూతనోత్సాహంతో పార్టీ బలోపేతానికీ, ప్రజా పోరాటాలకు సిద్ధమవుతుందని జిల్లా కన్వీనర్ వందవాసి నాగరాజు అన్నారు.

అలరించిన డప్పు ప్రదర్శనలు



జిల్లా మహాసభల సందర్భంగా ప్రజానాట్య మండలి, జానపద వృత్తి కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు అలరించాయి. డప్పుల దరువులతో, ఉద్యమపాటలతో పాలక ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎండగట్టారు.

ఎస్వీయూ ఆచార్యునిపై బజరంగ్ దళ్ నేతల దాడి



ప్రజాశక్తి - క్యాంపస్:
ఎస్వీయూలోని ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల ఆచార్య సిహెచ్.చెంగయ్య వర్సిటీలో మతప్రచారం చేస్తున్నారని ఆరోపణలతో బజరంగ్ దళ్ నేతలు ఆయన చాంబర్లో దాడికి ప్రయత్నించారు. వర్సిటీలో తరగతి గదిలో పాఠాలు చెప్పాల్సిన అధ్యాపకుడు మతబోధనలు చేయడం, హిందూ దేవతలను నీచంగా మాట్లాడడం, విద్యార్థులని వేధిస్తుండడం భరించలేక విద్యార్థులు వారి ఆవేదనను తమతో చెబితే ఆయన ఛాంబర్ కెళ్ళి పరిశీలించడం జరిగిందని ఆ సంఘం నేతలు చెప్పారు. దీంతో అక్కడికి చేరుకున్న మీడియా ఛానల్‌తో కూడా అసభ్యంగా, బాధాకరంగా మాట్లాడటంతో ప్రశాంతంగా ఆయనను బయటికి తీసుకొచ్చామని ఎలాంటి దాడి చేయలేదని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై విసి ఆచార్య అప్పారావుని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కమిటీ వేసి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

యూనివర్సిటీలో మతసామరస్యాన్ని కాపాడాలి : ఎస్ఎఫ్ఐ

విశ్వవిద్యాలయలు మేధావులకు కేంద్రంగా ఉండే విధంగా కృషి చేయాల్సింది పోయి మతకలహలకు కేంద్రగా మారకుండా యూనివర్సిటీ ఉన్నత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి డిమాండ్ చేశారు. మతాల ఆధారంగా ప్రచారం చేస్తే ఎవరిని ఉపేక్షించాల్సిన అవసరం లేదని, అలాగే బయటి వ్యక్తులు వచ్చి ప్రొఫెసర్లపై దాడి చేయడం భావ్యం కాదని, తక్షణమే ఇలాంటి సున్నితమైన అంశాల పట్ల యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా లక్ష్మీ కాసులహారం శోభాయాత్ర

గజ, గరుడ వాహనాల్లో అమ్మవారికి అలంకరణ



ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: తిరుమల శ్రీవారి లక్ష్మీ కాసులహారం శోభాయాత్ర సోమవారం తిరుచానూరులో వైభవంగా జరిగింది. ముందుగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి అదనపు ఈవో వెంకయ్యచౌదరి లక్ష్మీ కాసులహారాన్ని తిరుచానూరులోని శిల్పారామం - పసుపు మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా మాడవీధుల గుండా ఆలయానికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ, శ్రీవారి ఆభరణాలలో లక్ష్మీ కాసులహారం అత్యంత ప్రధానమైందని, పౌర్ణమి గరుడసేవ సందర్భంగా ఈ హారాన్ని శ్రీ మలయప్పస్వామి వారికి అలంకరిస్తామని తెలిపారు. సాక్షాత్తు స్వామివారు ధరించే ఈ హారాన్ని గజవాహనం, గరుడవాహన సేవల సందర్భంగా శ్రీపద్మావతి అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సోమవారం రాత్రి జరుగనున్న గజ వాహనానికి విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సోమవారం పట్టువస్త్రాలు సమర్పించారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం వరకు ఆధ్యాత్మిక పాదయాత్రను నిర్వహించారు. వేద పాఠశాలల పిల్లలతో పాటు అత్యధిక సంఖ్యలో అమ్మవారి భక్తులు తరలివచ్చి ఈ పాదయాత్రలో చెవిరెడ్డి వెంట నడిచారు. ప్రతి ఏటా అమ్మవారికి నిర్వహించే కార్తీక బ్రహ్మోత్సవాలలో విశిష్టమైన గజవాహన సేవకు, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో గరుడ వాహన సేవకు చెవిరెడ్డి సారెను సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలను తీసుకుని తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారికి సమర్పించడం జరిగింది.

ఫెంగల్ తో రైతుకు తీరని నష్టం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అల్పపీడన ప్రభావం వల్ల తిరుపతి జిల్లాలో పలు మండలాల్లో సోమవారం జడివాన కురిసింది. ముఖ్యంగా తిరుమల, తిరుపతిలో ఉదయం నుంచి వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వల్ల ప్రజలు బయటకు రాలేక ఇబ్బందుల పడుతున్న తరుణంలో ఉదయం నుంచి మళ్లీ వర్షం కురవడం వల్ల పలు రోడ్లు జలమయ్యాయి. తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపరిష్కారాల వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చి వెళ్లేవారు బస్సులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటితో పలుచోట్ల కాలువు డ్రైనేజీలు పొంగడంతో మున్సిపల్ పారిశుద్ధ విభాగం యుద్ధ ప్రాతిపదికంగా పారిశుధ్య చర్యలు చేపట్టడం జరిగింది. తిరుపతి డిఆర్ మహల్ అండర్ రైల్వే బ్రిడ్జి వెస్ట్ చర్చ్ అండర్ రైల్వే బ్రిడ్జి రాయల్ చెరువు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు చేరింది.

తుపాన్ నష్టాన్ని పరిశీలించిన కలెక్టర్

ఫెంగల్ తుపాన్ వలన కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను, ఆర్డీవో, జిల్లా అధికారులతో కలిసి పడమటి కండ్రిగ రహదారిపై ప్రవహిస్తున నీటి ప్రవాహాన్ని, నీట మునిగిన వరి పైరును పరిశీలించారు. పడమటి కండ్రిగ రహదారి నీటిలో సుమారు 150 ఎకరాలకు పైగా వరి పైరు నీట మునిగిందని ఇంఛార్జి సహాయ సంచాలకులు వ్యవసాయశాఖ కవిత తెలిపారు. వరదయ్యపాలెంకు చెందిన రాళ్ల కాలువ, కాలంగి వరద నీటి ప్రవాహం సూళ్లూరుపేట పట్టణంలోని రైల్వేట్రాక్ వద్ద కలిసే నేపథ్యంలో వరదనీరు వెనుకకు ఒత్తిడి వలన పడమటి కండ్రిగ రహదారి ప్రాంతాలపై నీటి ప్రవాహం వస్తుందని ఎస్ఈ తెలుగు గంగ ప్రాజెక్ట్ మదన గోపాల్ కలెక్టర్‌కి వివరించారు. అనంతరం కలెక్టర్ సదరు వై-పాయింట్ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో గత ఐదారు రోజుల నుండి కురుస్తున్నటువంటి వర్షాల వల్ల తడ, వరదయ్యపాలెం, సూళ్ళూరుపేట నియోజకవర్గ పరిధిలో ఎక్కువశాతం వర్షపాతం నమోదైందని, పలు ప్రాంతాల్లో వర్షాల వలన రోడ్లు తెగిపోవడం, చెరువు కట్టలు తెగిపోయి పంటపొల్లాలు నీట మునిగిన నష్టాలు వచ్చాయని తెలిపారు. అధికారులు పంటనష్టాలను పరిశీలించి జాబితా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందన్నారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు యుద్ధప్రాతిపదికన పునరుద్దరించడం జరుగుతుందని, చెరువులు బ్రీచ్‌లకు మరమ్మతులు చేయడం జరుగుతుందని తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలంలోని సంతవేలూరు చెరువు నిండి కలుజు పారుతున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. సదరు చెరువుకు ఒక భాగంలో బలహీనంగా ఉన్న కట్ట వద్ద ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి అవసరమైతే కరకట్టను బలోపేతం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అనంతరం జోరు వర్షంలోనూ శ్రీకాళహస్తి పట్టణం సమీపంలోని స్వర్ణముఖి నది ఆనకట్ట వద్ద వరద నీటి ప్రవాహాన్ని ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆర్డీఓలు కిరణ్మయి, భానుప్రకాష్ రెడ్డి, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

కెవిబి పురం: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మండలంలోని రైతులకు తీరని నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలోని రాయపేడు, కలత్తూరు, సదాశివపురం గ్రామాల్లో వేరువనగ, వరి పంటలు నేలమట్టమయ్యాయి. ఇప్పటి వరకు ఎకరాకు లక్షానలభై వేలు ఖర్చు అయ్యిందని, నాలుగు రోజులుగా కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు పంటలను నష్టపోయామని రైదులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి విపత్తు వలన పంట కోల్పోయి అప్పులపాలయ్యామని వాపోయారు.



నీట మునిగిన పంటను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

నీటి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యుత్ శాఖకు రూ.8లక్షలు నష్టం

నగరంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తుపాన్ కారణంగా నగరంలో కరెంటు స్తంభాలు , ట్రాన్స్ఫార్మర్లు నేలకూలాయి. దీని వల్ల విద్యుత్తు శాఖకు రూ. 8లక్షలు వాటిల్లినట్టు ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ కార్యనిర్వహణ అధికారి విన్నకోటి చంద్రశేఖర్ రావు తెలిపారు. చెట్లు తీగలు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, సకాలంలో పునరుద్ధరించినట్లు వివరించారు. నగరంలో స్తంభాలు, 20 ట్రాన్స్ఫార్మర్లు అగ్నిప్రమాదం జరిగిందని, 500 మీటర్లు కండక్టర్ లైన్స్ పడయ్యాయని, అయినా సకలంలో పునరుదరించినట్లు వివరించారు. సోమవారం ఉదయం బిటి.ఆర్ కాలని, మంగళం, చైతన్యం పురం, కృష్ణాపురం, పాతరేణిగుంట, కరకంబాడీ, మామండూరు, గాజులమండ్యం ఎస్టేట్‌లో పలు గ్రామాలను చంద్రశేఖర్ రావు అధికారులతో కలిసి సందర్శించారు. రేణిగుంట ఏడి, రమేష్, విద్యుత్ ఏఈలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని కాపాడిన గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని రాజులకండ్రి ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రత్నకుమార్ సోమవారం ఉదయం గోవిందవరం స్వర్ణముఖి నది కల్వర్టును దాటేందుకు యత్నించారు. నది ఉధృతంగా ప్రవహిస్తుండంతో వరదలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు తాళ్ల సాయంతో వెంటనే ఆయన్న రక్షించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: కలెక్టర్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయం సమీపంలోని సత్యసాయి కళ్యాణ మండపంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఆర్‌డిఓ కిరణ్మయి పాల్గొని ప్రజల నుంచి అర్జీల స్వీకరించారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీలను స్వయంగా అందించారు. అనంతరం అధికారులు అర్జీదారులకు గ్రీవెన్స్ నమోదు రసీదు ఇచ్చారు. కలెక్టర్ ప్రజాసమస్యలను సావధానంగా వింటూ పరిష్కారదిశగా అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలి: ఎస్పీ

తిరుపతి సిటీ:
ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చిన సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు వినూత్న కార్యక్రమం చేపట్టారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బాధితులు, అధికారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు పరిష్కరించే ఏర్పాటు చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఎంతో ప్రయాసపడి న్యాయం జరుగుతుందనే ఆశతో ప్రజలు ఎస్పీ కార్యాలయానికి వస్తారని, ఈ ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల నుంచి 48 ఫిర్యాదులు అందాయని వాటిని సబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు ఎస్పీ రావిమనోహర ఆచారి, డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 25 వినతులు


తిరుపతి టౌన్:



తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 25 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 25 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. సంబంధిత అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్‌సేతు మాధవ్, రవి, సెక్రటరీ రాధిక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ హాసిమ్, డీఈలు, ఏసిపిలు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పునఃపరిశీలించాలి

కేంద్ర మంత్రిని కలిసిన వైసిపి ఎంపిలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్
విశాఖ ఉక్కు కర్మాగారం ఆర్ఐఎన్ఎల్ ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పునఃపరిశీలించాలని కోరుతూ సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామిని కలిశారు. వైసిపి ఎంపీలు వైవి.సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, పివి.మిధున్ రెడ్డి, మేడా మల్లికార్జున రెడ్డి, మద్దిల గురుమూర్తి, అయోధ్య రామి ఒడ్డి గొల్ల బాబూరావు, గుమ్మా తనూజా రాణి ఉన్నారు. వారు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ద్వారా దాదాపు 20వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్ష ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదని, రాష్ట్రంలో ఇది అతిపెద్ద ప్రభుత్వరంగ పారిశ్రామిక యూనిట్ అని ఆయనకి వివరించారు. 2002లో స్టీల్ ప్లాంట్ పరిస్థితి బాగా లేదని పారిశ్రామిక, ఆర్థిక పునర్నిర్మాణ బోర్డు (బి.ఐ.ఎఫ్.ఆర్) నివేదించబడిన తర్వాత ప్లాంట్ ఆచరణాత్మకంగా మారిందన్నారు. ప్రస్తుతం దాదాపు 19700 ఎకరాల భూమి ఉందని, పట్టణ ప్రాంతంలో ప్లాంట్ ఉన్న ప్రదేశం వేగంగా విస్తరిస్తున్న కారణంగా ఈ భూముల విలువ కేవలం లక్ష కోట్ల రూపాయలను దాటవచ్చని ఆయనకి చెప్పారు. విశాఖపట్నంలోని విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణను పునఃపరిశీలించాలని, ప్లాంట్‌ను తిరిగి ట్రాక్‌లోకి తీసుకురావడానికి ఇతర అవకాశాలను అన్వేషించాలని వైసిపి ఎంపీలు అభ్యర్థించారు.

పారిశుధ్యం పట్టించుకునే నాథుడు ఏదీ?

- మురుగు కాలువలు కరువు
- వర్షపు నీటికి బురదమయం
- బురద నీటిలో మునిగిన కుళాయిలు
- జ్వరాలు వ్యాపిస్తాయని ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో మేజరు పంచాయతీ బుచ్చినాయుడు కండ్రిగలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. మురుగు కాలువలు లేక గ్రామంలో వర్షాలకు వీధుల్లోని గుంతలు బురదమయం అయ్యాయి. తాగునీటి కుళాయిలు ఆ గుంతల్లో మునిగి పోవడంతో కలుషిత నీటిని విష జ్వరాలు ప్రబలుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ పట్టించుకోక పోవడంతో పారిశుధ్యం అధ్వాన స్థితికి చేరుకుంది. స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాల్సి వుంది.

మండలంలోని అతి పెద్ద మేజర్ పంచాయతీ బుచ్చినాయుడు కండ్రిగ రిజర్వేషన్లలో భాగంగా ఈ పంచాయతీని ఎస్‌టిలకు కేటాయించారు. అందులో భాగంగా వైసిపి తరపున బూదురు వెంకటమ్మ సర్పంచిగా గెలుపొందారు. అయితే అప్పటి నుండి ఇప్పటివరకు సర్పంచ్ ఎక్కడా కనిపించడం లేదు. దీంతో గ్రామస్తులు 'మా సర్పంచ్ ఎక్కడ?' అని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీలో అనేక సమస్యలు తిష్టవేసినా సర్పంచ్ మాత్రం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. లక్ష్మీపురం గిరిజన కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో తాగునీటి కుళాయిలు బురద గుంతల్లో మునిగి తాగునీరు కలుషితమై గిరిజనులు విష జ్వరాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. బీసీ కాలనీలో పారిశుధ్యం పడక వేస్తున్నా అటు అధికారులు కానీ, ఇటు ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా మండల కేంద్రం నుండి కనమనంబేడుకు వెళ్లే రహదారిలో ఉన్న అరుంధతి వాడ రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడటంతో చిన్నపాటి వర్షం వస్తే నీరు నిల్వచేరి చెరువును తలపిస్తోంది. దీంతో కనమనంబేడు గ్రామస్తులు, అరుంధతి వాడ వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు పత్రికల్లో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా సమస్యను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ప్రతి శుక్రవారం వారపు సంతలో దుకాణాల వద్ద డబ్బులు వసూలు చేస్తున్న దారిపై వున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై చూపించకపోవడం దారుణమని పంచాయతీ ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించక పోతే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.


బిఎన్ కండ్రిగ పరిసరాల్లో చేరిన వర్షపు నీరు

క్రైం న్యూస్

14 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

రెండు వాహనాలు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి ఏర్పేడు సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు, వారి నుంచి రెండు వాహనాలు, గొడ్డళ్లు, రంపాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్ లో ఎంట్రీ పాయింట్లు తనిఖీ చేపట్టారన్నారు. చింతలపాలెం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక ఇన్నోవా, బొలేరో గూడ్స్ వాహనాల్లో కొంతమంది దిగుతూ కనిపించగా, వారు టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని చుట్టుముట్టగా, పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. పారిపోతున్న వారిలో 14 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద పిడిలేని ఇనుప బారిసలు, గొడ్డళ్లు, రంపపు చుట్ట, వంట చేసుకోవాడానికి అవసరమైన సామగ్రి కనుగొన్నామన్నారు. వారిలో 13మంది తమిళనాడుకు చెందిన వారు కాగా, ఒకరు చిత్తూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించమన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ లో సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రైతులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: కేవీబిపురం మండలంలోని రాయపేడు, కళత్తూరు, ఆరే, సదాశివపురం గ్రామంలోని వేరుశగన రైతులు సాగుచేసిన వందల ఎకరాలలో వేరుశనగ, వరి పంట తుపాను కారణంగా వర్షానికి నేల మట్టమైంది. ఇప్పటి వరకు ఎకరాకు పంట సాగు చేయాలంటే సుమారు లక్ష, నలభై వేలు వరకు ఖర్చు పెట్టామని, నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడ తెరిపిలేని వర్షం ప్రభావంతో వేరుశనగ, వరి పంట నేల మట్టం అయ్యి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఇబ్బందులు, అప్పులు చేసి వేరుశనగను పండించామన్నారు. తుపాను కలిగించిన నష్టం వర్ణనాతీతమని పేర్కొంటున్నారు. కొత్తగా పెట్టుబడి పెట్టాలంటే ఇప్పటి వరకు రుణం చేసి పెట్టుబడి పెట్టామని ఇప్పుడు ఏమీ చేయాలో తెలియడం లేదని ప్రభుత్వం, అధికారులు స్పందించి పంటనష్టం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదానికి చేరువలో విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని అంజిమేడు సమీపంలో పోతుమానుగుంట చెరువు కట్టపై వున్న స్తంభం గతంలో కురిసిన వర్షాలకు మరమ్మతులకు గురైంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని దుస్థితి ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారి ఏ సమస్య పరిష్కరించిన పాపాన పోలేదు. విద్యుత్ స్తంభానికి కర్ర సపోర్ట్ వుంది. ఇది విద్యుత్ అధికారుల పనితీరుకు నిదర్శనమని వెంటనే అధికారులు స్పందించి స్తంభానికి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా వున్న విద్యుత్ స్తంభం

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, డీఎస్పీ వీవీ రమణకుమార్, పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు కలిసి అండర్ బ్రిడ్జి వద్ద పరిశీలించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ప్రత్యామ్నాయం చూడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఒకటవ అండర్ బ్రిడ్జి నుండి భారీ వాహన రాకపోకలు సాగేలా చూడాలన్నారు. రెండో అండర్ బ్రిడ్జి మీదుగా భారీ వాహనాలను అనుమతించవద్దని, అప్పుడే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బస్సులు, వ్యాన్లకు ఇబ్బందులు ఏర్పడవని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వారికి సూచించారు. ఆయన వెంట పట్టణ సీఐ శేఖర్ బాబు , రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని గుమ్మళ్లదిబ్బ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, అధికారులతో ఎమ్మెల్యే సోమవారం సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పేదలు వస్తే వారికి పనులు చేసి పంపాలన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు కొత్తవారికి ఇవ్వనున్నట్లు అర్హులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచు రామయ్య, మస్తాన్ నాయుడు, వాటంబేటి శివకుమార్, పులిమి శ్రీనివాసులు, రహీమ్ పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్:

ఏర్పేడు మండలంలోని అంజిమేడు గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయం వద్ద కొంత మంది వయో వృద్ధులు ఆదివారం ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం 8 గంటల నుండే పింఛన్ల కోసం ఎదురు చూడసాగారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి పట్టణం విజయనగర్ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త రవి యాదవ్ తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే పులివర్తి నాని తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయ నిధి కింద రూ.10 లక్షల చెక్కు మంజూరు చేశారు. ఆ చెక్కును సోమవారం బాధితురాలి కుమారుడు రవి యాదవ్‌కు అందించారు. తన తల్లికి ఆరోగ్య సంరక్షణ కోసం సిఎం సహాయ నిధి మంజూరు చేసినందుకు సీఎంకు, స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానికి రవి యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

బిల్లులు చెల్లింపుకు క్యూ ఆర్ కోడ్ ఉపయోగకరం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ సంస్థ, విద్యుత్ బిల్లు చెల్లింపులను మరింత సులభతరం చేయటంలో భాగంగా విద్యుత్ బిల్ చివరన క్యూఆర్ కోడ్‌ని ప్రవేశపెట్టింది. తద్వారా త్వరితగతిన బిల్లులు చెల్లించే పద్ధతిని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అంజనేయులు ఆపరేషన్ సబ్ డివిజన్- 1 తిరుపతి తెలిపారు. వినియోగదారులందరు బిల్ చివరన ఉన్న క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేసుకొని, పేటీయమ్, గూగుల్ పే, ఫోన్‌పే వంటి ఆన్లైన్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ వినియోగదారుల ఏవైనా చిన్న విద్యుత్ సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వస్తే సత్వర, పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

విశ్వసనీయత పెంచుతున్న టాటా మోటార్స్ ట్రక్కులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: వినియోగదారుల విశ్వసనీయతను టాటా మోటార్స్ ట్రక్కులు మరింత పెంచుతున్నాయని టాటా మోటార్స్ ట్రక్స్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ రాజేష్‌కౌల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దఎత్తున పెట్టుబడులు, ప్రాజెక్టులు కీలక పరిశ్రమలు ఉత్పత్తి పెరగడం కేంద్రంగా మారడంతో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన మౌలిక సదుపాయాల వృద్ధిని సాధిస్తోంది. ఈ వేగవంతమైన విస్తరణ నిర్మాణం, మైనింగ్, లాజిస్టిక్స్ కార్యకలాపాలలో పెరుగుదల ద్వారా గుర్తించబడింది. ఈ రంగాలు కార్గో, నిర్మాణ సామగ్రి మొదలైన వాటి తిరుగులేని మొబిలిటీకి మద్దతు ఇవ్వడానికి నమ్మకమైన హెవీ- డ్యూటీ ట్రక్కులు డిమాండ్ చేస్తున్నాయన్నారు. టాటా మోటార్స్ ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటునందించే డంలో హెవీ- డ్యూటీ టిప్పర్లు, ట్రక్కులు, ట్రాక్టర్ సమగ్ర శ్రేణితో విభిన్న మొబిలిటీ అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది. టాటా మోటార్స్ తన ప్రీమియం ప్లాట్‌ఫామ్‌లో విస్తృత శ్రేణి పరిష్కారాలను అందిస్తుంది - అధిక ఉత్పాదకత, ప్రీమియం, ఎర్గోనామిక్ క్యాబిన్‌ల కోసం నిర్మించబడింది. ఎక్కువ గంటలు కూడా అలసట లేకుండా డ్రైవర్ సౌకర్యం డ్రైవింగ్ ఉత్తమ ఫీచర్లను అందిస్తున్నాయన్నారు. ఈ అవకాశాల్ని వినియోగదారులు మరింత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరుణుడు కరుణించినా అందని జల వనరులు

- ఫారెస్టు అధికారులు గట్టుల ఏర్పాటుతో నిండని చెరువు
- తాగు, సాగు నీటికి ఆందోళన

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామ పంచాయతీలోని ఎగువ కానూరు గ్రామానికి చెందిన పెద్ద చెరువు నీటితో నిండి కళకళలాడాల్సిన చెరువు కనీసం సగం చెరువు కూడా నీటితో నిండని దుస్థితిలో వుంది. ఈ చెరువు పరిధిలో సుమారు 350 ఎకరాలకు పైగా సాగుభూమి వుంది. వరి పైరుకు పూర్తిగా నీరు అందకపోవడంతో ఈ ప్రాంతంలో మెట్టపైర్లు ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వంగ, మిరప, బెండ తదితర పంటలను సాగు చేసుకుని నీటిని పొదుపుగా వాడుకుంటూ స్వల్ప కాలిక పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మరి కొంత పొలాల్ని నిమ్మ పంటను సాగు చేస్తున్నారు. అంతే కాకుండా చెరువు పక్కనే ఉన్న గిరిజన కాలనీకి ఎగువ కానూరు గ్రామానికి ఆ చెరువు బావి నుండి (తాగునీరు)మంచినీటి సరఫరా అవుతోంది. ఈ చెరువులో నీరులేని సమయంలో బావిలో నీరు లేక ముఖ్యంగా గిరిజన కాలనీ వారు అష్ట కష్టాలు పడుతుంటారు. ఇలాంటి అవసరం వున్నా ఈ చెరువుకు ఎదురు కాలువ చెక్ డ్యాం, జుమాను కాలువల నుండి వర్షపు నీరు వచ్చి ఈ చెరువు నీటితో నిండుతుంది. కానీ ప్రస్తుతం ఫారెస్ట్ వారు తమ హద్దులంటూ వేసిన గట్టుల కారణంగా చెరువు లోకి నీరు రాక చెరువు వెలితి గా కన్పి స్తుండ డంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. [illegible] అధికారులు చిర వ [illegible] ఫారెస్ట్ వారు ఏర్పాటు చేసిన గట్టు లాంటి కట్టలను తూములు ఏర్పాటు చేసి ఆ చెరువుకు నీళ్లు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలా చేయని పక్షంలో నీటి ఎద్దడి ఏర్పడి తాగునీటికి, సాగునీటికి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ ని వివరణ కోరగా స్పందించలేదు.


ఫారెస్టు అధికారులు గట్టు ఏర్పాటు చేయడంతో నీటి సరఫరా అందని చెరువు

జియో ట్యాగింగ్‌పై అపోహలు వద్దు :కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగలపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న జియో ట్యాగింగ్ పై ఎవరికి అపోహలు వద్దని, మీకు వచ్చిన ఓటిపిని సచివాలయ కార్యదర్శులకు చెప్పి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతోను, ఆన్లైన్ ద్వారా సచివాలయం కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. జియో ట్యాగింగ్ కోసం వెళ్తే ప్రజలు సహకరించడం లేదని పలువురు కమిషనర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నివసిస్తున్న వారి వివరాల కోసం నగరపాలక సంస్థ సచివాలయం సిబ్బంది కావాల్సిన సమాచారం సేకరిస్తున్నారన్నారు. ఇందులో ఎటువంటి మోసాలకు తావు లేదన్నారు. మ్యాపింగ్ వలన ఒక ప్రాంతంలో ఎంతమంది నివసిస్తున్నారు. ఈ క్రమంలో సచివాలయ సిబ్బందికి ఓటీపీ చెప్పి, లేదా బయో మెట్రిక్ వేసి సహకరించాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఇదే విషయాలను అధికారులు ప్రజలకు తెలిపి జియో ట్యాగింగ్, ఎన్.పి.సి.ఐ, ఎం.ఎస్.ఎం.ఈ, సర్వీసులు వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 82 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండి 85 అర్జీలు వచ్చాయి. కలెక్టరేట్ కు వచ్చిన అర్జీదారుల సమస్యలను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఓపికగా విని, సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను గడువులోపు అర్థవంతంగా పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. అత్యధికంగా 53 అర్జీలు రెవెన్యూ విభాగానికి వచ్చాయి. జేసీతో పాటు డిఆర్ఓ నరసింహులు, ఇతర విభాగాల అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.



ఆర్ఆర్ రెడ్డికి సత్కారం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలోని అశోక ప్యాలెస్ హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ ఆర్ ఆర్ రెడ్డిని బాలాజీ నర్సింగ్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ బాల్యంలో ఒక డ్రాప్ స్టూడెంట్‌గా ఉండి అంచెలంచెలుగా ఎదిగి ఒక మంచి డాక్టర్ గానూ, సేవా భావం కలిగిన వ్యక్తిగానూ, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. టీటీడీ మెడికల్ ఆఫీసర్‌గా, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్‌గా ఆయన చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యామ్ బాబు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ వర్ల మధుసూదన్, డాక్టర్ శ్రీకర్ రాజు పాల్గొన్నారు.


ఆర్ఆర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాళహస్తి వాసి సత్తా

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తిరుపతిలో జరిగిన ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల అండర్-22 విభాగం బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన షేక్ సమ్మద్ సత్తా చాటాడు. రెండో స్థానం సాధించి నిర్వాహకుల నుంచి ప్రశంసలు, ప్రశంసాపత్రం అందుకున్నారు. షేక్ సమ్మద్ పట్టణంలోని సందీప్ జిమ్‌లో శిక్షణ పొందుతున్నాడు.

వెటరన్ మారథాన్‌లో శ్రీకాళహస్తి వాసికి పతకం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి :

విశాఖ సాగరతీరంలో ఆదివారం వైజాగ్ రన్నర్స్ సొసైటీ, సంధ్యా మెరైన్స్ నిర్వహించిన సీనియర్ వెటరన్ 10కే మారథాన్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన నిత్య ఫిట్ నెస్ కేంద్రం రమణారెడ్డికి(60) పతకం దక్కింది. 10కె మారథాన్ లో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది వెంటరన్ లు పాల్గొనగా అందర్నీ వెనక్కి నెట్టి రమణా రెడ్డి మూడో స్థానం సాధించారు. విశేష ప్రతిభ కనబరచిన రమణా రెడ్డిని పలువురు అభినం దించారు.



ప్రమాదకర స్థాయిలో గూళూరు చెరువు

భయాందోళనలో ఆది ఆంధ్రవాడ వాసులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నైరుతి బంగాళాఖాతంలో ఫెంగల్ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు. నగిరి నియోజకవర్గ లోని గూళూరు చెరువు మండలంలోని అతి పెద్ద చెరువు చెరువు విస్తీర్ణం 440 ఉన్నాయి. ఆయ కట్టు 6 ఎకరాలకు నీళ్లు అందిస్తోంది. ఈ చెరువు పది సంవత్సరాలు క్రితం ఇలాంటి తరుణంలో నిండుగా తలపించింది. వర్షాలు లేనప్పుడు ఆ గ్రామ ప్రజలు 200 ఎకరాలు వరి పంటలు పండించుకునే వారు. ఆ గ్రామ చెరువు నిండడంతో పారుతున్న కలుజునీరు నగరి నియోజకవర్గంలో పలు గ్రామీణ ప్రాంతాలలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఫెంగల్ తో వేరుశనగ, వరి పంటలు నీట మునిగాయి. ఉధృతి గంట గంటకూ పెరగడం వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అక్కడక్కడ చెట్లు, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రెవెన్యూ, పోలీస్ శాఖ, అధికారులను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అప్రమత్తం చేశారు.

వైసిపి సీనియర్ నాయకుడు బాలాజీ మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ వైసిపి నాయకులు కే బాలాజీ సోమవారం మృతి చెందారు. గత 30 సంవత్సరాలుగా అటు కాంగ్రెస్‌లోనూ, తరువాత వైసిపికి అండగా ఉంటూ పార్టీకి ఎనలేని సేవలు అందించారు. ముఖ్యంగా తడుకు పంచాయతీలో తడుకు గ్రామ ప్రజలకు ఎనలేని సేవలందించారు. ఇలాంటి నాయకుడిని వైసిపి కోల్పోవడం చాలా బాధాకరమైన విషయమని, తన నాయకుడు బాలాజీని కోల్పోవడం చాలా బాధాకరంగా వుందని ఆ పార్టీ నాయకులు పలువురు పేర్కొన్నారు.


ఫైల్ ఫొటో

వర్సిటీలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విభాగంలో చదివే బిఇడి విద్యార్థులచే నిర్మించిన వివిధ పాఠ్యంశాలను తెలిపే వివిధ ఆకృతులను ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించారు. వివిధ పాఠ్యంశాలతో పాటు ఆధునిక, సామాజిక, ఆధ్యాత్మిక విషయాలను తెలిపే వివిధ ఆకృతులు, చూపరులను ఎంతో చక్కగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం విసి ఆచార్య జియస్ఆర్ కృష్ణమూర్తి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ విచ్చేసి ఈ ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మౌఖింగా బోధించే విషయాలకన్నా, ప్రదర్శిని మాధ్యమంగా బోధించే విషయాలు వారు మరింత చక్కగా గుర్తుపెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫె సర్ ఆర్‌జె రమాశ్రీ, శిక్షావిభాగం అధ్యక్షురాలు ప్రొఫెసర్ కె కాదాంబిని, వరిష్ఠాచార్యులు ప్రొఫెసర్ పి వెంకటరావు, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఎస్ దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ ఎస్ మురళీధరరావు, ఎపిఆర్ఓ డాక్టరు కనపాల కుమార్, [illegible] కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎసచ్చిదానందమూర్తి, ఇతర అధ్యాపకులు డాక్టరు ఎ సునీత, డాక్టరు ఎస్.వైష్ణవి, డాక్టరు ఎ చారుకేశ్, డాక్టరు లక్ష్మణ్ కుమార్, డాక్టరు కుమార్ బాగేవాడి మఠ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న పాఠ్యాంశ ఆకృతుల ప్రదర్శన

పారిశుధ్య కార్మికులపై చిన్నచూపు వద్దు..

ప్రజాశక్తి - నారాయణవనం: నారాయణవనం మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడర్లు) పై చిన్నచూపు చూడవద్దని ఏఐటీయూసీ నాయకులు ఎంపిడివో గుణశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అరణ్యం కండ్రిగ సచివాలయంలో స్వచ్ఛభారత్ కార్మికులు పనులు చేస్తున్నారని వీరిని ఈనెల 1వ తేదీ నుండి ఆగిపోవాలని పంచాయతీ కార్యదర్శి హుకుం జారీ చేశారని ఇంతలే పని చేయాలా? వద్దా? అని ఎంపిడివోను ప్రశ్నించారు. మండలంలోని 19 పంచాయతీలలో 45 మందికి పైగా స్వచ్ఛభారత్ కార్మికులు పనిచేస్తున్నారని వీరికి దాదాపు 28 నుండి 30 నెలల పాటు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం మారితే తమ బతుకులు మారుతాయని జీతాలు పెరుగుతాయని ఆశతో పనిచేస్తున్న కార్మికులపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పెత్తనం చెలాయిస్తూ రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. తమ పంచాయతీకి ట్రాక్టర్ వచ్చిందని, అందుకు డ్రైవర్‌ని ఏర్పాటు చేసుకోవాలని అయ్యేఖర్చులు భరించాలని ఖర్చులున్నందువల్లే ఆగిపోవాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీ వో గుణశేఖర్ మాట్లాడుతూ వారిని తొలగించాలని తమకు ఆదేశాలు రాలేదని ఎలాంటి భయం అవసరం లేదని గ్రీన్ అంబాసిడర్లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ చంద్రబాబు ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బాబు మేస్త్రి, స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు దాసు, శేషాద్రి నాయకులు చెంగయ్య, రవి, లలితమ్మ స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.


ఎంపిడిఓకు వినతిపత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

చెరువుల రక్షణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చెరువు కట్టలకు గండ్లు పడకుండా పటిష్ట చర్యలు తీసుకుం టున్నట్లు సత్యవేడు ఇరిగేషన్ డీఈ రత్నారెడ్డి తెలిపారు. వర్షాల నేపథ్యంలో చెరువుల భద్రతపై తహశీల్దార్, ఇరిగేషన్ డీఈ, ఏఈలు సోమవారం సమీక్షించారు. మండలంలో అన్ని చెరువులు వర్షాలకు నిండి ఉన్నాయని ప్రస్తుతం చెరువులకు ఎటువంటి ప్రమాదం లేదని వర్షాలు కొనసాగితే ప్రమాదం వుందని గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపపడ తున్నట్లు 'డీఈ తెలిపారు. తహశీల్దారు మాట్లాడుతూ మండలంలో చెరువులపై ఎలాంటి సంఘటన జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు.

పిహెచ్‌సిలో మహిళ సురక్షిత ప్రసవం

డాక్టరు, సిబ్బంది కృషి ఫలితం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఓ నిరుపేద గిరిజన గర్భిణి సోమవారం క్షేమంగా ప్రసవించింది. డాక్టర్ చంద్రకళ, సిబ్బంది సురక్షిత ప్రసవానికి కృషి చేశారు. వేణుంబాక గిరిజన కాలనీకి చెందిన మాధవి ఇంటి వద్ద పురుటి నొప్పులతో బాధపడుతున్న సమయంలో ఏఎన్‌ఎం అమరావతి పిహెచ్‌సికి తరలించారు. డాక్టర్ చంద్రకళ గర్భిణి సుఖ ప్రసవానికి అన్ని జాగ్రత్తలు తీసుకుని సాధారణ ప్రసవం చేసి తల్లి బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ సంపూర్ణమ్మ, డ్యూటీ స్టాఫ్ నర్స్ వనజ, హెల్త్ విజిటర్ మైథిలి, ఏఎన్‌ఎం అమరావతి, ఎఫ్ఎన్‌ఓ నాగమ్మ సహకరించి పీహెచ్‌సీలో కాన్పు జరిగేలా చూశారు.


వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సురక్షితంగా ప్రసవించిన గర్భిణి

గురుకుల పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన బీసీ గురుకుల పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలను మంజూరు చేయించానని కోట ప్రాంతంలోని గురుకుల పాఠశాలను తీసేయాలని గత ప్రభుత్వం భావించిందని, సీఎం చంద్రబాబుతో ఈ విషయాన్ని చర్చించి గూడూరులో గురుకులం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, మస్తాన్ నాయుడు, రహీమ్, ఇజ్రాయేల్ కుమార్, అల్లీహుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ అవేర్నెస్ కార్యక్రమాలు వారం రోజుల పాటూ నిర్వహించారు. వివిధ పోటీలలో (వ్యాసరచన, వక్తృత్వం, రంగోలి, రీల్ మేకింగ్ మొదలైన) గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అనుకోకుండా ఎదురయ్యే వివిధ వ్యాధుల పట్ల విద్యార్థినివిద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించే వివిధ అవగాహన కార్యక్రమాలు ఎంతో అభినందించదగినవని పేర్కొంటూ విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఆరోగ్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి పీర కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఝాన్సీ, వాణి, శైలజ, కిరణమై, శ్రీధర్ శర్మ, డాక్టర్ నారాయణ రాజు, లక్ష్మీ, మై మూన్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కోటేశ్వరరావు, రవి రాజు లక్ష్మీ హిమబిందు విద్యార్థి విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

అన్నదాతలకు కల్పతరువు అరణియార్: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ మధ్య తరహా ప్రాజెక్టు ఈ ప్రాంత ఆయకట్టు రైతులకు కల్పతరువు అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. అరణియార్ నీటి మట్టం 27 అడుగులు దాటిన నేపథ్యంలో ప్రాజెక్టు గేట్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పైకెత్తి అధిక వరద నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే గా ఉన్న గత ఆరేళ్ల ప్రతి ఏటా ఈ ప్రాజెక్టు పూర్తిగా నిండడం, తన చేతుల మీదుగా గేట్లను పైకెత్తి వరద నీటిని దిగువకు వదలడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పూర్తి స్థాయిలో నిండడం వల్ల దిగువన ఉన్న పిచ్చాటూరు, నాగలాపురం మండలాల రైతులతో పాటు నింద్ర, కెవిబి పురం మండలాల మాత్స్యకారులు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఈ ప్రాంత అన్నదాతలు ఏడాదిలో మూడు పంటలు నీటి కొరత లేకుండా పండించుకుంటూ ఆనందంగా ఉన్నారన్నారు. భవిష్యత్తులోనూ ప్రతి ఏటా ఇలాగే అరణియార్ జలాశయం నిండి పొంగి పొర్లుతూ ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమర్, ఈఈ మదన్ గోపాల్‌రాజు, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి డి ఇలంగోవన్‌రెడ్డి, తహశీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో మహమ్మద్ రఫీ, ఇరిగేషన్ లోకేష్, పార్టీ నాయకులు, పద్దు రాజు, శ్రీనివాసులు, ఢిల్లీ ఆయకట్ట రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అరణియార్ ప్రాజెక్టుకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

చెవిరెడ్డి నిజస్వరూపాన్ని గుర్తించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిజస్వరూపాన్ని ఇప్పటికైనా వైసిపి పెద్దలు గుర్తించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనర్ విషయంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తప్పోకాదో వైసిపి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిలు గుండెపై చేయి వేసుకొని ఆలోచించాలన్నారు. గతంలో స్ట్రాంగ్ రూమ్ వద్ద తనపై దాడి జరిగిన సమయంలో మంగళంకు చెందిన వ్యక్తిని ఎవరో కొట్టారని, తనవద్దకు పరామర్శకు వచ్చిన 37 మందిపై 307 కేసులు పెట్టిన విషయం గుర్తు తెచ్చుకోవాలని వైసిపి నేతలు పరిశీలించుకోవాలన్నారు.

IN THE COURT OF THE IInd Additional Junior Civil Judge: Tirupati
O.S.No. 1051/2023

Union Bank of India, T.K.Street Branch, Tirupati ...Plaintiff

V/s

M/s Vamsi Readymade Garments ...Defendant

SUMMONS TO DEFENDANT

M/s Vamsi Readymade Garments rep. by its Prop. K.Vamsi S/o K.Srihari Shop No.9, Bazaar Street, Opp. To Shriram chits, Renigunta

Please take summons that the above suit filed by the plaintiff for recovery of loan amount against you and the matter is posted to 31.12.2024 for your appearance either in person or through your counsel at about 10.30 am. in the above court. In the event of your absence, the matter will be decided exparte.

Hearing Date: 31-12-2024

K.RAMESH BABU
Advocate, Tirupati

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: PUTTUR
E.A.NO. 206/2024, E.P. No. /2024
O.S. No. 115/2013

Between : S.Usha Rani ...Decree Holder

And :

G.S. Rajamanikyam Naidu (died) & others ....Judgment debtors

NOTICE TO THE RESPONDENTS NO.2 TO 4 BY WAY OF PUBLICATION

To

R.2. G. Premela, W/o. S/o. Late. G.S. Rajamanikyam Naidu,
R.3.G.Harish, S/o. Late. G.S. Rajamanikyam Naidu,
R.4. G.Lakshmi, W/o. Gavasker, D/o. Late. G.S. Rajamanikyam Naidu The J.Drs No.2 to 4 are residing at D.No.4-113, N.T.R Colony, Puttur Town and Mandal, Tirupati District.,

Please take notice that, the petitioner has filed the above E.P against the Judgment debtors for realization of suit debt and the said case is posted to 09-12-2024, for the appearance of Respondents No.2 to 4, the respondents are directed to appear on that day i.e., 09-12-2024 at 10.30 a.m., before this Hon'ble court, either in persons (or) through an Advocate and file your objections if any, if you have fail to do so, the matter will be decided exparte against you.

Sri.GALI RAMESH, B.Com, B. L.,
Sri. N. Nadamuni, LL.B.
Sri. P. Lakshminarayana LL.B.
Kum. S. Nadiya, B.Com, LL.B.
Sri. C. Sai Naresh, LL.B.
Smt. A. Kusuma Kumari, LL.B.
Advocates/Puttur

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో ఆదిలక్ష్మి కాలనీ గిరిజన పాఠశాలలను ఎంఈవో రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం సోమవారం పర్యటించారు. మొదట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినివిద్యార్థుల విద్య, కనీస వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత నెలవాయి జెడ్పి స్కూలులో మధ్యాహ్న భోజన పరిస్థితి, బిఎన్ కండ్రిగ జెడ్పి హైస్కూలు విద్యార్థుల విద్య ఏ స్థాయిలో వుందో విద్యార్థినివిద్యార్థులను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. వారి రోజువారి హోంవర్క్‌ను పరిశీలించారు. విద్యార్థులకు రోజువారి హోంవర్క్ ఇచ్చి ఉదయం పాఠశాలకు వచ్చేటప్పుడు కచ్చితంగా రాసుకుని రావాలని తల్లిదండ్రులదే బాధ్యతని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పుతారని, మిగిలిన సమయాల్లో చదువుకు తల్లిదండ్రులు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. తర్వాత నెల వాయి జెడ్పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు ఎంఈవో సైతం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్: డిసెంబర్ 10వ తేదీన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మానవ హక్కుల పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు సంబంధించి గోడపత్రికను ఇన్‌ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పిస్తున్న మానవ హక్కుల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ఆ హక్కుల పైన అవగాహన కలిగినప్పుడే మనల్ని మనం పరిరక్షించుకోవచ్చని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పాఠశాల స్థాయి నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, కల్చరల్ కోఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్, మానవ హక్కుల విభాగ ఒప్పంద అధ్యాపకులు డా. గట్టు రంజిత్ కుమార్, డా.రవిబాబు, పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కుక్కంబాకు, కాంపాళెం దళితవాడలో మరమ్మతులకు గురైన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు ట్రాన్సుకో ఏఈ చలపతి ఎట్టకేలకు సోమవారం మరమ్మతులు చేయించి విద్యుత్‌ను అందించారు. కుక్కంబాకు, కాంపాళెం దళితవాడలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు రెండు మిని ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతులు గురికావడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఏఈ స్పందించి సకాలంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించి విద్యుత్‌ను అందించారు. కాంపాళెం దళితవాడలోనూ రెండు విద్యుత్ స్తంభాలు వర్షాలకు వాలి పోవడంతో వాటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌ను అందించారు. వెంటనే స్పందించిన అసిస్టెంట్ ఇంజనీర్ చలపతికి రెండు పంచాయతీల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర వ్యవసాయ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు–2024 లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయిలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తిరుపతి, బాపట్ల, నైరా వ్యవసాయ కళాశాల ప్రాంగణాల్లో మూడు విడతల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. మూడు విడతల పోటీలలో శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థుల జట్టు బిస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. చెస్(మహిళ) రన్నర్ అప్, లాంగ్ జంప్ లో రెండవ స్థానం, హై జంప్ లో మూడో స్థానం దక్కించుకున్నారు. నైరా వ్యవసాయ కళాశాల వేదికగా ఆఖరి విడతలో జరిగిన క్రీడా పోటీలలో తిరుపతి కళాశాల జట్టు ఫుట్ బాల్ విజేతగా, 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో, 200 వందల మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో, 4ఐ100 మీటర్ల రిలేలో మూడో స్థానంలో నిలిచారు. విశ్వవిద్యాలయ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలలో విజేతలుగా నిలిచిన శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి. రమణ సోమవారం ఛాంబర్ లో అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేయడానికి కృషి చేసిన వ్యవసాయ కళాశాల విద్యార్థి వ్యవహారాల అధికారి ఎంఎస్వి చలం, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్ రెడ్డి, వ్యాయామ అధ్యాపకురాలు జి రాజేశ్వరి బృందాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ అభినందించారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు సిబ్బంది కోరారు. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, విజయవాడ వారు పబ్లిక్ అవేర్నెస్ ఆన్ బ్యాంకు ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ డిసెంబర్ 2 వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా సోమవారం నెల్లూరు జిల్లాకేంద్ర సహకార బ్యాంకు గూడూరు శాఖలో ఖాతాదారులకు, జిల్లా ప్రజలకు అందిస్తున్న వివిధ లోన్లను, సర్వీసుల పై ప్రజలకు అవగాహన క్యాంపైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ హరిత మాట్లాడుతూ బ్యాంకు అత్యధికంగా డిపాజిట్ల పై 333 రోజులకు 7.40 శాతం, 444 రోజులకు 7.50 శాతం , 555 రోజులకు 7.60 శాతం అందిస్తోందన్నారు. ఈ స్కీములపై సీనియర్ సిటిజన్లకు 0.50 శాతం సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.75 శాతం అదనంగా ఇస్తున్నారన్నారు. బ్యాంకు ద్వారా అనేక వ్యవసాయ రుణాలు సొసైటీల ద్వారా, నేరుగా , గ్రామీణ పట్టణ ప్రాంతాలలో గృహ రుణాలు, చిరు వ్యాపారులకు , స్థిరాస్తి తాకట్టు పై ఎస్ఒడీ రుణాలు, ఉన్నత చదువులకు విద్యా రుణాలు , బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.5 వేలు వంతున ఒకరికి గరిష్టంగా రూ.20 లక్షల వరకు త్వరిత గతిన రుణం పొందే అవకాశం వుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సరిత, పద్మ , ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామనాయుడు , నారాయణ రెడ్డి , మల్లీశ్వరయ్య, వై నారాయణ పాల్గొన్నారు.





లైంగిక వేధింపుల నిరోధచట్టంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టం 2013 పై అవగాహన కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో హ్యుమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్ లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టం 2013 ప్రధాన లక్షణాలను, శిక్షాస్మృతులను గురించి వివరించారు. మహిళలను మాటలు, ప్రవర్తన,సైగలు, చేష్టలుద్వారా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, ఆఫీసులో, పాఠశాలలో, వివిధ ప్రదేశాలలో లైంగిక వేధింపుల కేసులు వెలుగు చూస్తున్నాయని, ఇలాంటి చర్యలకు చట్టం కఠినమైన శిక్షలు విధిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసిస్టెంట్ ఎం.ఇంద్రాణి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌కు అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : పాపానాయుడు పేట గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నంద్యాల వెంకట సుబ్బమ్మ ఎన్ఎస్ఎస్ వాలంటీర్సుకు ఎయిడ్స్ వ్యాదిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యలతో నివారించుకోవడం తప్ప, మరో మార్గం లేని వ్యాధి ఎయిడ్స్ అని, ప్రపంచంలోనే ఇదో మహమ్మారి అని ఇది నాలుగు రకాలుగా వ్యాప్తి చెందుతుందని, టీనేజ్‌లో ఉన్న విద్యార్థిని విద్యార్థులు ఈ వ్యాధి పట్ల అప్రమత్తతో ఉండాలన్నారు. ఈ వ్యాధి వ్యాప్తిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో వుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో వేలం పాటలు నిర్వహించండి

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ వేలం పాటలకు 15 రోజులకు ముందుగా నోటిఫికేషన్ ఇచ్చి అనంతరం పంచాయతీ ఉన్నతాధికారుల సమక్షంలో పారదర్శకంగా బహిరంగ వేలం వేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి మణికి వినతి పత్రాన్ని అందించారు. ఈ ప్రభుత్వంలో క్రమ పద్ధతిలో వేలంపాటలు నిర్వహించి పంచాయతీకి ఆదాయాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన కూటమి నాయకులు మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, మాజీ ఉప సర్పంచ్ మునీర్, వార్డు సభ్యులు రాజేష్ రెడ్డి, అప్రోజ్, జనసేన నాయకుడు నగరం భాస్కర్ బాబు పాల్గొన్నారు.

హాస్టల్లో కార్పెట్లు పంపిణీ

ప్రజాశక్తి- రేణిగుంట: హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే కార్పెట్లు సోమవారం రేణిగుంట బి సి హాస్టల్లో 66 మంది విద్యార్థులకు వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వేంకటేశ్వర్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని హితవు పలికారు. విద్యార్థులకు కార్పెట్లు పంపిణీ చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పంటకు బీమా చేయండి..రక్షణ పొందండి..

మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని రైతులు పంట బీమా నమోదు చేసుకుని రక్షణ పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి కోరారు. సోమవారం మండలంలోని సొరకాయలపాళ్యం పంచాయతీ చల్లా వారి పల్లి గ్రామంలో పంట బీమాపై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ 2024–25 సీజన్ లో రైతులు పొలాలలో వేసే పంటలకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద ప్రతి రైతు పంట బీమా చేసుకోవాలన్నారు. రైతులు పంటల భీమా ఆవశ్యకతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.–తుపాన్, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు పంట నష్టంగా ఆర్థిక సహాయం అందిస్తామని వివరించారు. రైతులు పొలాలలో సాగు చేస్తున్న పంటలకు ఈ– క్రాప్‌లో నమోదు చేసుకుని నిర్ణీత గడువులోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులు అని తెలిపారు. తిరుపతి జిల్లా లో వేరుశనగ కి రూ.480 (ఒక ఎకరాకు), వరి కి రూ.630(ఒక ఎకరాకు) చొప్పున రైతులు సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించి రసీదు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రాపురం మండల వ్యవసాయాధికారిణి స్రవంతి